ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్టం 40.3 : కనిష్టం 22.7
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
సోమవారం 14 ఏప్రిల్ 2025



నేటితో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగింపు

తాంసి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం యువతకు రుణ సౌకర్యం కల్పించాలనే సదుద్దేశంతో రాజీవ్ యువ వికాస్ పథకాన్ని ప్రారంభించింది. అయితే ఈ దరఖాస్తుల గడువు సోమవారంతో ముగియనున్నట్లు మండల ప్రత్యేక అధికారి వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు సోమవారం సాయంత్రం వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, సంబంధిత పత్రాలను ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు. గ్రామాలలో డప్పు చాటింపు వేయించాలని, యువతీ యువకులు, రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

అంగరంగ వైభవంగా మహంకాళి అమ్మవారి బ్రహ్మోత్సవాలు



వాయిపేట్ మహంకాళి అమ్మవారి ఆలయంలో భక్తుల సందడి

సిరికొండ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాయిపేట్ గ్రామంలో కొలువైన మహంకాళి అమ్మవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా జైమహంకాళి యూత్ సభ్యుల ఆధ్వర్యంలో సకల సౌకర్యాలు కల్పించారు. శనివారం మొదటిరోజు సాయంత్రం ఆలయ పూజారీ కినక శంభు మహరాజ్ ఆధ్వర్యంలో దీపోత్సవం కార్యక్రమంతో ప్రారంభమైంది. ఆదివారం ఉదయం ధ్వజారోహణం, అమ్మవారికి గంగాజలంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం మహపూజలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రతీరోజు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ బ్రహ్మోత్సవాల సందర్భంగా వాలీబాల్, కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలు మూడు రోజుల పాటు నిర్వహిస్తామని మాజీ సర్పంచ్ పెందూర్ గంగాధర్ తెలిపారు. నిత్యం ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిభింబించేలా పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని జైమహంకాళి యూత్ అధ్యక్షుడు పోయం బారిక్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఆయా ప్రాంతాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఉట్నూర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ తన స్వగ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. కల్లూరుగూడలో ఎమ్మెల్యే ఇంటి సమీపంలోనే ఉన్న ఆలయ నిర్మాణానికి గ్రామస్థులతో కలిసి భూమిపూజ చేయడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ దేవరి, పటేల్, గ్రామస్థులు పాల్గొన్నారు.



పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

రాజ్యాంగ రక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం : సోయం

ఇచ్చోడ, ఏప్రిల్, 13(ఆంధ్రజ్యోతి): జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు మండలంలోని కేశవపట్నం, నర్సాపూర్, సిరిచెల్మ, గుండాల గ్రామాల్లో ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన మాజీ ఎంపీ సోయం బాపురావు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను గ్రామాల నుంచి బహిష్కరణ చేయాలని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనని మట్టికరిపిస్తేనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల బలోపేతం అవుతుందన్నారు. ఇందులో పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, నాయకులు శ్రీధర్, కోటేశ్వర్, లక్ష్మణ్, ఆసిఫ్‌ఖాన్, అశోక్, రషీద్, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ సమస్యను పరిష్కరించాలి'

నార్నూర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వారం రోజుల నుంచి మండలంలో సమయంతో సంబంధం లేకుండా రాత్రీ పగలు విద్యుత్ కోతలు విధిస్తూ ప్రాంత ప్రజలకు ఇబ్బంది గురి చేయడం ఏమిటని దళిత జేఏసీ రాష్ట్ర కార్యదర్శి సంతోష్ మండల అధికారుల పని తీరుపై మండిపడ్డారు. ఆదివారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో మీడియా సమావేశం అయన మాట్లాడుతూ ఇప్పటికే తీవ్రమైన ఎండలు ఉన్నాయి. తాగునీటి ఇతరత్రా సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడితున్నారని, అయినా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. రాత్రి విద్యుత్ లేక దోమల బెడదతో ప్రజలు అవస్థలు పడతున్నారని, ఇప్పటికైనా నిరంతర విద్యుత్ అందించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఇందులో ఉత్తం, సిద్దార్థ, రవి కాంత్ పాల్గొన్నారు.



పేకాటరాయుళ్లను అరెస్టు చేస్తున్న పోలీసులు

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

● రూ.16,830 నగదు స్వాధీనం : సీఐ

జైనథ్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని సావాపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు జైనథ్ రూరల్ సీఐ డి.సాయినాథ్ ఆధ్వర్యంలో ఆదివారం దాడి నిర్వహించారు. ఇందులో ఉప్పల రాకేష్, గైక్వాడ్ కిషన్, అగర్కర్ రవీందర్, రావత్‌అమూల్, సేవపూరి ప్రమోద్, లాడే సుధాకర్‌లను అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. వారి దగ్గర ఉన్న పేకాట ముక్కలతో పాటు రూ.16,830ల నగదును స్వాదీనం చేసుకున్నారు. ఈ సందర్బంగా జైనథ్ రూరల్ సీఐ డి.సాయినాథ్ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాతో పాటు జైనథ్ మండలంలోని ఆయా గ్రామాలలో మట్కా, గుట్కా, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారి పై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ మండల ఎస్సై వి.పురుషోత్తం, ఏఎస్సైలు సిరాజ్, స్వామి, కానిస్టేబుల్‌లు రాజు, శ్రీనివాస్, రైజోద్దిన్‌లతో పాటు మండల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



● రక్త పరీక్షలు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు



● ఉట్నూర్‌లోని తెలంగాణ రోగ నిర్ధారణ పరీక్ష కేంద్రం

- పేరుకే తెలంగాణ వ్యాధి నిర్ధారణ కేంద్రాలు (టీ హబ్)
- రాష్ట్రంలో మొత్తం 34 టీ హబ్‌లు
- సిబ్బంది నియామకాలు నిల్
- పెండింగ్‌లోనే ప్రతిపాదనలు
- డిప్యూటేషన్లతో నెట్టుకొస్తున్న వైనం
- ఉమ్మడి ఆదిలాబాద్‌లోని ఏజెన్సీ ప్రాంత ప్రజలకు తప్పని తిప్పలు

సేవలు సరే.. సిబ్బంది ఏరి?

ఉట్నూర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ వ్యాధి నిర్ధారణ కేంద్రం (టీ హాబ్)లలో ప్రజలకు సేవలు అందుబాటులోకి వచ్చిన సిబ్బందిని మాత్రం నియమించడంలో ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ఏజెన్సీ ప్రాంతంలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ, జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్, కెరమెరి మండలాల ప్రజలకు సౌకర్యంగా ఉట్నూర్ డివిజన్ కేంద్రంలోని జిల్లా ఆసుపత్రిలో గత ప్రభుత్వం హయాంలో కోటి రూపాయలతో తెలంగాణ వ్యాధి నిర్ధారణ పరీక్ష కేంద్రం భవనం నిర్మించారు. లక్షలాది రూపాయల విలువైన వ్యాధి నిర్ధారణ పరీక్షల యంత్రాలు ఏర్పాటు చేసినా.. సిబ్బందిని నియమించడంలో నిర్లక్ష్యం చేయడం వల్ల గత ప్రభుత్వ కాలంలో ప్రారంభానికి నోచుకోలేదు. అంతేకాకుండా రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో ఖానాపూర్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన వెడ్మ బొజ్జుపటేల్ జోక్యం చేసుకొని జిల్లా అధికారులను సమన్వయం చేసి సిబ్బందిని డిప్యూటేషన్‌పై నియమించేలా చేసి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క చేతుల మీదుగా టీ హబ్‌ను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.

రాష్ట్రంలో 34 వ్యాధి నిర్ధారణ కేంద్రాల ఏర్పాటు

రాష్ట్రంలో ప్రజలకు సరైన వైద్యం అందించాలంటే వ్యాధి నిర్ధారణ ఎంతో అవసరమని భావించిన ప్రభుత్వం.. కోట్లాది రూపాయలు కేటాయించి రాష్ట్ర వ్యాప్తంగా 34 తెలంగాణ వ్యాధి నిర్ధారణ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఉట్నూర్, మంచిర్యాల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ, హైదరాబాద్, జగిత్యాల, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, ములుగు, నాగర్‌కర్నూల్, నల్గొండ, నారాయణపేట, నర్సంపేట, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా, రంగారెడ్డి, సంగారెడ్డి, సూర్యపేట, వికారబాద్, వనపర్తి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఈ వ్యాధి నిర్ధారణ కేంద్రాలు టీ హబ్‌లను ఏర్పాటు చేసింది.

సిబ్బందిని నియమించాలి

రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన టీ హబ్‌లలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ప్రజలకు మెరుగన వైద్యం అందుబాటులోకి రావాలంటే ప్రతీ కేంద్రానికి తగిన సిబ్బంది ఉండాలి. దీనిలో భాగంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలను పరీక్షించే ఒక ల్యాబ్ మేనేజర్‌తో పాటు ఐదుగురు ల్యాబ్ టెక్నీషియన్లు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ముగ్గురు సానిటేషన్ వర్కర్లు, ఇద్దరు సెక్యూరిటీ గార్డులు, బయోకెమిస్ట్రీ, మైక్రో బయాలజీ వైద్య నిపుణులను నియమించాల్సి ఉంటుంది. కానీ ఈ నియామకాలు ఎక్కడా జరగలేదని తెలుస్తుంది.

రోగులకు కావాల్సిన సేవలను అందిస్తున్నాం

: డాక్టర్ కపిల్, టీ హబ్ ఇన్‌చార్జి, ఉట్నూర్



ఉట్నూర్‌లోని తెలంగాణ వ్యాధి నిర్ధారణ కేంద్రం ద్వారా రోగులకు కావాల్సిన సేవలు అందిస్తున్నాం. రోజుకు 200 నుంచి 250 శాంపిల్స్ పరీక్షించడం జరుగుతుంది. టీ హబ్‌లో 57 పరీక్షల నిర్ధారణ జరుగుతోంది. ఆదిలాబాద్ టీ హబ్ నుంచి వచ్చిన 1200 శాంపిల్స్ కూడా పరీక్షించడం జరిగింది. రెగ్యూలర్ సిబ్బందిని నియమిస్తే ఇంకా సేవల్లో పురోగతి ఉంటుంది.



ఏసీ సౌకర్యం లేని కోల్డ్ రూమ్

పెండింగ్‌లోనే ప్రతిపాదనలు

ఉట్నూర్‌లోని తెలంగాణ వ్యాధి నిర్ధారణ కేంద్రంలో రేడియాలజి, ఎక్స్‌రే, ఈసీజీ, టూడికో, యుఎస్‌జీ, ఇలాంటి పరీక్షల కోసం కావాల్సిన సౌకర్యాల ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవేకాకుండా కోల్డ్ రూమ్, కెమికల్ దెబ్బతినకుండా ఉండడానికి ఎయిర్ కండిషన్ సౌకర్యం కల్పించాల్సి ఉంది.

డిప్యూటేషన్లతోనే కాలం గట్టెక్కుతోంది

తెలంగాణ వ్యాధి నిర్ధారణ కేంద్రంలో కావాల్సిన సిబ్బందిని ప్రభుత్వం నియమించక పోవడంతో జిల్లా అధికారులు సమన్వయం చేసుకొని డిప్యూటేషన్ల ఆధారంగా సిబ్బందిని నియమించి కాలం గట్టెక్కిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పని చేస్తున్న ఇద్దరు, జిల్లా ఆసుపత్రిలో పని చేస్తున్న నలుగురిని టీహబ్‌కు డిప్యూటేషన్లు ఇవ్వడంతో సేవలు అందుబాటులోకి వచ్చాయి.

ప్రభుత్వ కార్యాలయాలు..

ప్రమాదాలకు నిలయాలు!

● బేల మండలంలో ప్రమాదకరంగా మారిన పలు కార్యాలయాలు ● బిక్కుబిక్కుమంటూ విధులకు హాజరవుతున్న ఉద్యోగులు

బేల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : బేల మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. మండలంలోని తహసీల్దార్, ఎంపీడీఓ, వ్యవసాయ శాఖ కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో పైకప్పు పెచ్చులు ఊడిపోతుండడంతో ఇనుప ఊచలు బయటకు తెలియాడుతున్నాయి. గోడలు, స్తంభాలకు పగుళ్లు ఏర్పడ్డాయి. కార్యాలయంలో పని చేస్తున్న అధికారులు, సిబ్బందితోపాటు పనుల నిమిత్తం వచ్చే స్థానికులు సైతం ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. దీంతో కార్యాలయ ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులకు హాజరవుతున్నారు. ఈ విషయం గురించి పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి మండల అధికారులు తీసుకు వెళ్లిన ఫలితం లేకుండా పోయిందని వారు వాపోతున్నారు. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయానికి నూతన భవన ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.





తహసీల్దార్ కార్యాలయంలో పెచ్చులూడిన దృశ్యాలిలా..



బేలలో శిథిలావస్థకు చేరిన తహసీల్దార్ కార్యాలయం



శిథిలావస్థకు చేరిన వ్యవసాయ శాఖ కార్యాలయం



వ్యవసాయ శాఖ కార్యాలయంలో పెచ్చులూడిన దృశ్యం



రగల్ జెండా కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్పీ, ఎమ్మెల్యే

20న సభను విజయవంతం చేయండి

● సభా స్థలిని ఎస్పీ, ఏఎస్పీ, స్తూపం కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆనాడు హక్కుల కోసం పోరుబాటు పట్టి అసువులు బాసిన అమరుల వీరుల స్తూపాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రజా ప్రభుత్వం కోటి రూపాయలను మంజూరు చేసి అభివృద్ధి పనులను చేపట్టిందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక అమర వీరుల స్తూపం వద్ద సభకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌లతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దళిత గిరిజన దండోరా సభలో అమర వీరులకు ఇచ్చిన ప్రతీ హామీని సీఎం రేవంత్ రెడ్డి గారు నెరవేర్చారని, అమర వీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చామని తెలిపారు. ఈ సభకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క రానున్నట్లు తెలిపారు. 20న జరిగే సభలో కొన్ని అమర వీరుల కుటుంబాలకు ట్రైకార్ ద్వారా పది లక్షల లోన్లు ఇస్తామని అన్నారు. శాంతియుత వాతావరణంలో అమర వీరులకు నివాళులు అర్పించాలని, ఆదివాసీలు పెద్దఎత్తున తరలివచ్చి సభను విజ యవంతం చేయాలని పిలుపునిచ్చారు. పాత రగల్ జెండా కమిటినే యధావిధిగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇందులో ఎస్సై సాయన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, రగల్ జెండా కమిటీ అధ్యక్షులు తోడసం నాగోరావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ జహీర్, మాజీ సర్పంచులు కొరెంగ సుంకట్‌రావు, మెస్రం నాగనాథ్, తదితరులున్నారు.



జిల్లా ఎస్పీని శాలువాతో సన్మానిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



పంచనామ నిర్వహిస్తున్న ఎస్సై దివ్య భారతి

బేల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : పంట సాగు కోసం చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం బేల మండలంలోని దౌన గ్రామంలో చోటు చేసుకుంది. బేల ఎస్సై దివ్య భారతి తెలిపిన వివరాలు ప్రకారం.. బేల మండలం దౌన గ్రామానికి చెందిన రాథోడ్ అరవింద్ (35) అనే రైతు తన 4 ఎకరాల భూమిలో పంట సాగుచేశాడు. సాగు కోసం చేసిన బ్యాంక్ అప్పుతోపాటు ప్రైవేట్ అప్పులు ఎక్కువ అవడంతో అప్పు ఎలా తీర్చాలో తెలియక ఇంట్లో ఎవరు లేని సమయంలో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. శనివారం రాత్రి 10.30 నిమిషాల సమయంలో రాథోడ్ అరవింద్ వాంతులు చేసుకోవడంతో గమనించిన భార్య భర్తను అడగగా పురుగుల మందు సేవించినట్లు తెలిపాడు. చికిత్స కోసం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి ఆటోలో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు తెలిపారు. భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు.

మూలనపడిన చెత్త రిక్షాలు

ఉట్నూర్, ఏప్రిల్13 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలకు సమకూర్చిన చెత్త రిక్షాలు చెత్త కుప్పల పాలయ్యాయి. సంపూర్ణంగా పథకాల సేవలు అందడం లేదు. ఫలితంగా గత ఐదేళ్ల క్రితం రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు కేటాయించిన చెత్తరిక్షాలు ఉత్తరిక్షాలు అయ్యాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు ప్రభుత్వ నిధులు వృథా కాకుండా సక్రమంగా వినియోగించే పథకాల కోసం నిధులు ఖర్చు చేయాలని పరిశీలకులు అంటున్నారు.

బాధితుడికి ఆర్థిక సహాయం

సోనాల, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి):సోనాల మండలం సాకెర గ్రామానికి చెందిన రాకేష్ ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. ఆదివారం తన తోటి మిత్రులు రూ.13వేల ఆర్థిక సహాయాన్ని అందజేసి తమ స్నేహితుడి కుటుంబానికి ఎల్లవేళలఅండగా ఉంటామని మనోధైర్యాన్ని ఇచ్చారు.ఇందులో హరీష్, సుగుణాకర్, లక్ష్మణ్, చక్రపాణి, రంజిత్, నందికేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'వివేకవంతమైన జీవితాన్ని గడపాలి'



ప్రవచనం చేస్తున్న కృష్ణానంద

జైనథ్, ఏప్రిల్13 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మనిషి వివేక వంతమైన జీవితాన్ని గడపాలని సుందర చైతన్యస్వామి శిష్యులు కృష్ణానంద అన్నారు. ఆదివారం ఉమ్మడి జనథ్ మండలంలోని పిప్ప ర్వాడ గ్రామంలో 32వ సుందర చైతన్య వార్షికోత్సవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మనిషికి కోరికలు అపరిమితం అని కోరికలను అదుపులో పెట్టుకొని మనిషి ఆధ్యాత్మిక మార్గంలో నడవాలన్నారు. సమాజంలో ప్రతి పౌరుడు విలువతో కూడిన జీవితాన్ని బతకడంతో పాటు ప్రతిఒక్కరూ చెడువ్యసనాలను విడి సన్మార్గంలో నడవాలన్నారు. ఈ సందర్భంగా క్విజ్‌పోటీలను నిర్వహించి వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సుందర చైతన్య సత్సంగ సభ్యులు నర్సింగ్‌రెడ్డి, పిప్పర్‌వాడ మాజీ సర్పంచ్ ఎస్.వెంకట్‌రెడ్డిలతో పాటు ఆయా గ్రామాల భక్తులు, మహిళలు సుందరచైతన్య సత్సంగ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



వాహినికి షీల్డ్ అందిస్తున్న కోచ్

నేరడిగొండ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన వేణు గోపాల్ (పోలీస్) కుమార్తె ఆంధ్రప్రదేశ్‌లో గల కోరుకొండ సైనిక్‌స్కూల్‌కు తెలంగాణ నుంచి ఒక్క ఆమెనే ఎంపికయి విద్యనభ్యసిస్తూ క్రీడల్లోనూ సైతం రాణిస్తుంది. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన ఇంటర్నల్ స్పోర్ట్స్ కాంపిటేషన్స్‌లో 5.2కేఎం రన్ విజయవంతంగా పూర్తి చేసి మొదటిస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా కోరుకొండ స్కూల్ అధ్యాపకులు ఆమెను మొదటి బహుమతిని అందజేసి దూర ప్రాంతం నుంచి వచ్చి ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థిని వాహినిని అభినందించారు.

పల్లెల్లో మొదలైన జడ కొప్పులాట



జడ కొప్పులాట ఆడుతున్న దృశ్యం

తాంసి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): చీకటి పడిందంటే చాలు పల్లెల్లో కోలాటాలు, జడకొప్పులాటతో గ్రామాలు మారుమోగుతున్నాయి. వేసవి కాలాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఈ ఆట ఆడడం సహజం. దీంతో గిరిజన ప్రాంతాలతో పాటు పలు గ్రామాలలో ఈ జ డప్పులాటను ఆడుతూ కనువిందు చేస్తున్నారు. ప్రతిరోజు సాయంత్రం ఏడు గంటల నుంచి నడిరాత్రి వరకు ఈ ఆట ఆడారు. ఆయా గ్రామాలలో వారికి తోచినట్లుగా ఏర్పాటు చేసుకొని పాటలు పాడుతూ మేళ వాయిద్యాల మధ్య ఈ ఆట ఆడుతున్నారు. ఒక్కో గ్రామంలో ఒక్కోతీరులో ఈ ఆట ఆడడం ఆనవాయితీగా వస్తుంది. ఈ జడ కొప్పులాటలో యువతి యువకులతో పాటు వృద్ధులు కూడా ఆడటం అభినందనీయం.

పేకాట స్థావరంపై దాడి

మావల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై మావల పోలీసులు దాడి చేశారు. ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వాగాపూర్ గ్రామ పరిసరాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేశామన్నారు. ఈ మేరకు 12 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరి నుంచి రూ.35 వేల నగదుతో పాటు తొమ్మిది మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అంబేద్కర్ ఆలోచనలే కేంద్ర ప్రభుత్వ విధానాలకు స్ఫూర్తి

● భారతీయ జనతా పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్



విగ్రహానికి శుద్ధి నిర్వహిస్తున్న బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు

ఉట్నూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనలే కేంద్ర ప్రభుత్వ విధానాలకు స్ఫూర్తి అని భారతీయ జనతా పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ అన్నారు. అంబేద్కర్‌ని కాంగ్రెస్ పార్టీ అనేకసార్లు అవమానించిందన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనలే మోదీసర్కార్‌కు ఆదర్శం అని పేర్కొన్నారు. అంబేద్కర్ జయంతి వేడుకల సందర్భంగా ఆదివారం ఉట్నూర్ పట్టణ శాఖ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహశుద్ధి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌ని అనేకసార్లు అవమా నించిందని గుర్తుచేశారు. శుద్ధి కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, మండల శాఖ ప్రధానకార్యదర్శి బింగి వెంకటేశ్, జాతీయ నాయకులు శ్రీరాం నాయక్, కూటికల ఆశన్న, జిల్లా ఉపాధ్యక్షులు కోలిపాక రాజశేఖర్, సాడిగే రాజేశ్వర్, తన్నీరు సతీష్, బొడ్డుకిరణ్, మహేందర్, నాగభూ షణ్, అంజన్న, చింతల రమణ పాల్గొన్నారు.

సెల్‌టవర్‌తో విద్యార్థుల ఇబ్బందులు



గిమ్మా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జేసీబీతో వేసిన మట్టి

జైనథ్, ఏప్రిల్13 (ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని గిమ్మా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలు పక్కన గల సెల్‌టవర్ చుట్టు ఉన్న మట్టిని తొలగించారు. ఈ ఘటన పాఠశాల ఆవరణలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానిక గిమ్మా మాజీ ఎంపీటీసీ కోలభోజన్న, సీనియర్ రాజకీయ నాయకులు ఐనేని సంతోష్‌రావ్‌ల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి....గిమ్మా గ్రామానికి చెందిన మామిడిపెల్లి సతీష్‌రావ్, మామిడిపెల్లి నితిన్‌రావ్ తమ పంట పొలంలో ఉన్న సెల్ టవర్ ఇబ్బంది కలుగుతుందన్న నేపథ్యంలో గిమ్మా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వకుండా మట్టిని తొలగించారు. విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో సెల్‌టవర్ మట్టి పాఠశాల ఆవరణలో జేసీబీ ద్వారా వేయడం ద్వారా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో పాటు పాఠశాల ఆవరణలో హరిత హారం కింద నాటిన మొక్కలు పూర్తిగా తొలగించారు. ఈ సంఘటనకు పాల్పడ్డ మామిడిపల్లి నితిన్‌రావ్, మామిడిపల్లి సతీష్‌రావ్‌లపై గిమ్మా గ్రామస్థులు జైనథ్ మండల ఎస్సై వి.పురుషోత్తంకు ఫిర్యాదు చేశారు. పాఠశాల ఆవరణకు పక్కన గల సెల్‌టవర్ కారణంగా రేడియేషన్‌తో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని అన్నారు. బాధ్యుల పై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని గిమ్మా గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఉట్నూర్‌లో క్రైస్తవుల శాంతి ర్యాలీ



ఉట్నూర్‌లో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఉట్నూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ ఉట్నూర్ డివిజన్ యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ ఉట్నూర్ డివిజన్ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ఉట్నూర్ పట్టణంలో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ ప్రవీణ పగడాల మరణ విషయమై శాంతిర్యాలీ నిర్వహించారని ప్రెసిడెంట్, పాస్టర్ బి.డినాయల్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా క్రైస్తవులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ సీహెచ్ ఆర్ జోసెఫ్, ఫాస్టర్ రాజరత్నం, యూసీఏ ప్రెసిడెంట్ బ్రదర్ మిక్కాయల్, లాజర్ , నక్కశాంసన్ తదితరులు పాల్గొన్నారు.

చట్టం అతిక్రమిస్తే చర్యలు

● ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రౌడీయిజానికి తావు లేదని కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో షేక్ సలీం అలియాస్ కైంచి సలీంపై సోషల్ మీడియాలో బైక్‌పై నోట్లో కత్తి పెట్టుకొని ప్రదర్శనలు చేస్తూ వీడియోలు పోస్ట్ చేసిన కారణంగా కేసు నమోదు చేశామని, నోట్లో కత్తులు పెట్టుకొని ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తూ, కత్తులతో ప్రజల వద్ద డబ్బులు వసూలు వసూలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో రౌడీయిజాన్ని ప్రదర్శించిన షేక్ సలీం అలియాస్ కైంచి సలీంపై కేసు నమోదు చేశామని, అతని వద్దనుంచి చాకు స్వాధీనం చేసుకొని అతనిపై అరెస్ట్ చేశామని తెలిపారు. ఇతనిపై ఇదివరకే ఏడు కేసుల్లో ముద్దాయిగా ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో 2019 సంవత్సరంలో హత్య కేసు లో, 2025 సంవత్సరం రూరల్ పోలీస్ స్టేషన్‌లో చోరీ కేసు, తదితర కేసులున్నాయని తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

లక్ష్మణచాంద, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడ్యాల్ గ్రామసమీపంలోని సరస్వతి కెనాల్‌లో గుర్తుతెలియని మృతదేహం ఆదివారం లభ్యమైంది. ఎస్సై రహమాన్ మాలిక్ తెలిపిన వివరాల ప్రకారం... స్థానికులు ఇచ్చిన సమాచారం ప్రకారం... సంఘటన స్థలానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు. మృతుడి వయస్సు 30 నుండి 35 సంవత్సరాల వరకు ఉంటుందని, ఎత్తు ఐదు ఫీట్ల వరకు ఉంటాడని, మృతుడి బాడిపై ఆరెంజ్ కలర్ టీ షర్ట్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ఉందని దర్యాప్తులో తేల్చారు. కాబట్టి ఎవరైనా ఈ మృతదేహాన్ని గుర్తు పట్టినట్లయితే ఎస్సై లక్ష్మణచాంద నెంబర్ 8712659521, సీఐ సోన్ నెంబర్ 8712659519లకు సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

ప్రబంధకారిణి సలహా సమితి ఎన్నిక

ముథోల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథో ల్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో రాబోయే 3 సంవత్సరాలకు (2025-2028) ప్రబంధకారణి, సలహా సమితి, విద్వత్ సమితి సభ్యులను శ్రీ సరస్వతీ విద్యాపీఠం సూచనల మేరకు పాఠశాల సమితి కార్యదర్శి ధర్మపురి సుదర్శన్ ప్రకటించారు. పాఠశాల ప్రబంధకారిణిలో కొండావార్ సంజీవ్ అధ్యక్షులుగా, రేళ్ల రమేష్ ఉపాధ్యక్షులు, వేదపాఠక్ నిశికాంత్ కార్యదర్శిగా, దర్బార్ నవీన్ సహా కార్యదర్శిగా, కోలేకర్ శంకర్ కోశాధికారిగా, కంది మానాజీ, బొంతుల దత్తు, కొండావార్ సంతోష్, ప్రధానాచార్యులు ఉన్నారు.

ఖానాపూర్ శివారులో రోడ్డు ప్రమాదం



ధ్వసమైన ద్విచక్ర వాహనం



రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన ఆటో, కారు

ఖానాపూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులోని కొమురం భీమ్ చౌరస్తాలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్, స్థానికులు తెలిపిన కథనం ప్రకారం... ఖానాపూర్ పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీకి చెందిన ఏ. చిన్నయ్యకు సంబంధించిన కుటుంబసభ్యులు నిర్మల్‌లో చనిపోయారు. దీంతో చిన్న కుటుంబ సభ్యులు ఆరుగురితో కలిసి ఆటోలో సాయంత్రం ఏడుగంటలో సమయంలో ఖానాపూర్ నుంచి నిర్మల్ బయలుదేరారు. కొమురం భీమ్ చౌరస్తా వద్దకు రాగానే వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఖానాపూర్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం మితిమీరిన వేగంతో ఓవర్‌టేక్ చేసే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో డబుల్ బెడ్ రూమ్ కాలనీ నుంచి ఖానాపూర్ వైపు ఎదురుగా వస్తున్న కారును సదరు ద్విచక్ర వాహనం ఢీకొట్టి ఆటోపై పడింది. ద్విచక్ర వాహనం వేగంగా వచ్చి ఆటోపై పడడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. అందులో ప్రయా ణిస్తున్న చిన్నయ్య, రమేష్ సహా నలుగురికి గాయాలయ్యాయి. అతివేగంతో వచ్చిన బైక్‌పై ఉన్న ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండల వాగ్దారికి చెందిన హన్మాండ్లు, తర్లంకు చెందిన ముత్యంలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రు లను ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన అనం తరం క్షతగాత్రులను అంబులెన్స్‌లో నిర్మల్‌కి తరలించారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

ఖానాపూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడి తనువు చాలిం చిన ఘటన ఖానాపూర్ మండలంలో రాజూర గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే పెంబి ఎస్సై హనుమండ్లు తెలిపిన కథనం ప్రకారం... రాజూర గ్రామానికి చెందిన కోంద్ర సత్యనారాయణ(39) అనే వ్యక్తి గత కొంతకాలంగా అప్పుల బాధతో మనోవేదనకు గురవుతున్నాడు. కాగా గత 20 రోజుల క్రితం సత్యనారాయణ భార్య కోంద్ర రజిత తన ఇద్దరు కుమారులను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఇంట్లో ఒంటరిగా ఉండడం, సత్యనారాయణ శనివారం రాత్రి 11:30 గంటల సమయంలో తన మిత్రులైన కోల సతీష్, రాపెల్లి భోజన్నలతో మాట్లాడి ఇంటికి వెళ్లాడు. ఉదయం 8 గంటల వరకు సైతం సత్యనా రాయణ ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో రాజూర గ్రామానికి చెందిన శెట్టి గణేష్ అనే వ్యక్తి సత్యనారాయణ ఇంటికి వెళ్లి చూశాడు. కాగా సత్యనారాయణ ఇంట్లో ఉన్న దులానికి ఉరేసుకొని వేలాడడం గమనించిన గణేష్ చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చాడు. గ్రామస్థులు వచ్చి చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలాన్ని పెంబి పోలీసులు పరిశీలించారు. మృతుడు సత్యనా రాయణ మొదటి భార్య చనిపోగా రజితను రెండో పెళ్లి చేసుకున్నాడు. సత్యనారాయణ మొదటి భార్య కూతురు, రెండో భార్యకు ఇద్దరు కుమారులు సంతానం ఉన్నారు. ఈ ఘటనలో సత్యనారాయణ భార్య రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హనుమండ్లు తెలిపారు.

మతి స్థిమితం లేని వ్యక్తికి సపర్యాలు

భైంసా, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రమైన భైంసాలో మండుటెండలో ఒంటిపై దుస్తులు లేక అవస్థలు పడుతున్న మతిస్థిమితం లేని వ్యక్తికి మాజీ జడ్పీటీసీ సభ్యుడు సూర్యం రెడ్డి సపర్యలు చేసాడు. ఆదివారం పట్టణ పరిధిలోని నిర్మల్ క్రాస్‌రోడ్డు సమీపంలో మతి స్థిమితం లేని వ్యక్తి ఒకరు చిన్న పాటి నెక్కరు వేసుకొని ఎండ వేడిమికి తాళలేక పాట్లు పడ్డాడు. ఇదే సమయంలో అక్కడి ప్రాంతం మీదుగా భైంసా పట్టణంలోకి వస్తున్న భైంసా మాజీ జడ్పీటీసీ సభ్యుడు సూర్యం రెడ్డి మతి స్థిమితం లేని వ్యక్తి పరిస్థితిని గుర్తించి అక్కడ ఆగి సపర్యలు చేపట్టారు. పక్కనే ఉన్న రెడిమెడ్ బట్టల షాపు వద్దకు సదరు మతి స్థిమితం లేని వ్యక్తిని తీసుకవెళ్లి కొత్త దుస్తులు కొనిచ్చాడు.

నేడు ఆశ్రమ నిర్మాణానికి భూమిపూజ

బోథ్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమం నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేయనున్నారు. కార్యక్రమానికి ఆచార్య రామానుజాచారి చంద్రసింగ్ జి.మహారాజ్ మంగిరాములు మహారాజ్ కృష్ణ దాస్ స్వామిలతో పాటు జిల్లా కలెక్టర్ రాజశిస జిల్లా పోలీసు అధికారి అఖిల్ మహాజన్‌లను ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా ఎంపీతో పాటుగా ఎమ్మెల్యేలు మాజీ మంత్రులను సైతం ఆహ్వానించారు. సోనాల మండలంలోని గుర్రాల తండా గ్రామం సమీపంలో 12 ఎకరాల స్థలంలో బ్రహ్మయోగ ఆశ్రమం నిర్మాణానికి చర్యలు ప్రారంభమయ్యాయి. ఆశ్రమం నిర్మాణానికి గ్రామానికి చెందిన కైలాస్ భూమిని దానంగా ఇచ్చారు. దీంతో బ్రహ్మయోగ ఆశ్రమం నిర్మాణానికి ట్రస్టు వారు ముందుకు వచ్చారు. గత కొన్ని సంవత్సరాల కాలంగా తమ గ్రామంలో బ్రహ్మయోగ ఆశ్రమం వారి ఆధ్వర్యంలో ఆశ్రమాన్ని నిర్మించాలని కోరుతూ వస్తున్నామని గ్రామానికి చెందిన భూదాత కైలాస్ తెలిపారు. అయితే ఆశ్రమ నిర్వాహకులు సరైన స్థలం చూపిస్తే నిర్మిస్తామని పేర్కొనడంతో తాను తమ సహోదరుడు డాక్టర్ కర్తాల్ సింగ్‌తో చర్చించి భూమిని దానంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చామన్నారు. బ్రహ్మ యోగ ఆశ్రమాన్ని 10 ఎకరాల స్థలంలో పది కోట్ల రూపాయలతో నిర్మించేందుకు ఆశ్రమ నిర్వాహకులు ఒప్పుకోవడం జరిగిందన్నారు. యోగ తోపాటు వివిధ రకాల వ్యాధులకు ఆయుర్వేద చికిత్సలు ఉంటాయన్నారు.

దేశసేవ చేయడం అభినందనీయం

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న గ్రామస్తులు

నేరడిగొండ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): చిన్న వయసులోని దేశసేవ చేయడం అభినందనీయమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం ఇచ్చేడ మండలంలోని కోకస్ మన్నూర్ గ్రామానికి చెందిన గోపుల నాగచైతన్య ఆర్మీ ఉద్యోగం సాధించిన విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నేరడిగొండ మండల కేంద్రంలో గల తన నివాసంలో యువకుడిని సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ చిన్న వయసులోనే దేశ సేవ చేయాలన్న యువకుడి ఆలోచన గొప్పదని అభినందించారు. అనంతరం బోథ్ మండలంలోని కౌట గ్రామంలో ఈనెల 16వ తేదీన జరిగే శ్రీ ఊరపోచమ్మ విగ్రహ జీర్ణోద్ధారణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కౌట వీడీసీ సభ్యులు ఆహ్వానపత్రికను అందజేశారు. ఈనెల 23వ తేదీన గ్రామంలో జరిగే వీరయ్య విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని కౌట కుర్మె గోల్లోళ్ల సంఘ సభ్యులు ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ స్వామి, గ్రామ జ్యోతి అధ్యక్షులు బడాల శ్రీకాంత్ రెడ్డి, సభ్యులు కొర్రి సురేష్, వెండి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడి రిమాండ్



నిందితుడితో పోలీసులు

బోథ్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంటేగాం గ్రామానికి చెందిన పెందూరు ప్రభు అనే వ్యక్తి వద్ద గంజాయితో పట్టుబడంతో ఆయనను అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు సీఐ వెంకటేశ్వరావు ఎస్సై ప్రవీణ్‌లు తెలిపారు. మండలంలో ఎవరైనా గంజాయి సాగుచేసినా విక్రయించిన సేవించిన కేసులు తప్పవని సీఐ హెచ్చరించారు.

'విగ్రహ ప్రతిష్ఠాపనకు రండి'

బోథ్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16న మండలంలోని కౌటాబి గ్రామంలో ఊరపోచమ్మ విగ్రహ జీర్ణోద్ధారన కార్యక్రమానికి రావాలని కౌటాబి గ్రామ వీడీసీ సభ్యులు అంతేగాక ఈనెల 23న గ్రామంలో జరిగే జట్టి వీరయ్య విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి రావాలని ఎమ్మెల్యేను కురుమే గొల్లోల్ల సంఘం సభ్యులు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డాక్టర్ స్వామి, గ్రామ జ్యోతి అధ్యక్షులు బాడల శ్రీకాంత్ రెడ్డి, సభ్యులు కొర్రి సురేష్, వెండి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేసుకున్న రైతు

బోథ్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచ్చేర గ్రామానికి చెందిన రైతు రమణారెడ్డి తన సొంత చేనులోకి వెళ్లేందుకు జేసీబీ ద్వారా లక్ష రూపాయలు ఖర్చుపెట్టి రోడ్డు వేసుకుంటున్నారు. తన చేనులోకి వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో రైతు జేసీబీ ద్వారా రోడ్డు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వచ్చారు. తన చేనులో పామ్ ఆయిల్ చెట్లు పెట్టడం జరిగిందని అయితే భవిష్యత్తులో రోడ్డు అవసరం ఏర్పడుతుందని భావించి తాను సొంతంగా ఈ రోడ్డును వేసుకున్నట్లు తెలిపారు. మధ్యలో వాగు ఉందని అధికారులు మధ్యలో పైపులు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యాశాఖా అధికారికి సన్మానం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా విద్యాశాఖ పరీక్షల అధికారి మూడారపు పరమేశ్వర్‌ను ఆదివారం టీఎస్టీవేల సంఘ భవనంలో సన్మానించారు. టీఎస్‌యూటీఎఫ్ 12 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయనకు సన్మానం చేశారు. అధ్యక్షుడు దాసరి శంకర్, ప్రధాన కార్యదర్శి పెంట అశోక్, ప్రధానోపాధ్యాయుడు రాజు నాయక్, కే. నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలో అగ్నిప్రమాదం

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని హ్యాండిక్యాప్ కాలనీ సమీపంలోని హార్టికల్చర్ నర్సరీలో ఆదివారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. నర్సరీలోని మామిడి వనంలో చెత్తా చెదారానికి నిప్పు అంటుకోవడంతో వేగంగా మంటలు విస్తరించాయి. దీంతో స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు ఘటనాస్థలానికి చేరుకొని ఫైర్ ఇంజిన్ సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రజల రక్షణే పోలీసుల ధ్యేయం : రూరల్ సీఐ



మాట్లాడుతున్న సీఐ ఫణీంధర్, ఎస్సై విష్ణువర్ధన్

మావల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణే పోలీసుల ధ్యేయమని రూరల్ సీఐ ఫణీంధర్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పోలీసులు మీ కోసం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రజల కోసమే పోలీసులు పని చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. యువత అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని, చెడు వ్యసనాలకు బానిసకావద్దని, చదువుతో పాటు క్రీడ లపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. గ్రామాల్లోకి ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు వస్తే డయల్ వందకు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో మావల ఎస్సై విష్ణువర్ధన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బీపీ మండల్‌కు నివాళి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : అవినీతిపై అయ్యర్ కమిషన్ వేసి విచారణ చేయించిన బీపీ మండల్‌కు ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. సాయన్న డిమాండ్ చేశారు. బీపీ మండల్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. జీవితంలో మండల్ సోషలిస్ట్ రాజకీయ ఆలోచన పరుడిగా పని చేశారన్నారు. మండల్ కమిషన్ 39 సిఫారసులను అమలు చేయాలన్నారు. అవి సాధించినప్పుడు మండల్‌కు అసలైన నివాళి అన్నారు.

ఊపందుకున్న 'ఉపాధి' పనులు

● 2024-25 ఆర్థిక సంవత్సరం నిర్దేశిత లక్ష్యం వంద శాతం పూర్తి ● ఈ ఏడాది లక్ష్యం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు ● ఉపాధి పనులు చేసేందుకు కూలీల ఆసక్తి



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

దిలావర్‌పూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఉన్న ఊరులోనే ఉపాధి కల్పించి వలసలు నివారించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చి ఉపాధి హామీ పథకం పనులు పల్లెల్లో ఊపందుకుంటున్నాయి. ఈ పథకం ద్వారా జాబ్ కార్డు కలిగిన ప్రతీ ఒక్క కూలీకి ఉపాధి పని కల్పిస్తున్నారు. దిలావర్‌పూర్ మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను కూలీలకు 2,10,890 పనిదినాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. మార్చి వరకు వివిధ గ్రామాల కూలీలకు 2,22,169 రోజుల పని కల్పించి నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించినట్లు ఈజీఎస్ అధికారులు పేర్కొంటున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి 2,23, 000ల పనిదినాల లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, అనుమతులు ఇంకా రాలేదని అధికారులు పేర్కొంటున్నారు.



కూలీలకు మోటివేషన్ చేస్తున్న ఉపాధి హామీ అధికారులు

ఉపాధి పనికి పెరిగిన డిమాండ్..

రాష్ట్రంలో ఉపాధి హామీ పనులు చేసిన భూమి లేని నిరుపేద కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రూ.12వేలు అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడంతో గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు డిమాండ్ పెరిగింది. పనులు ఎప్పుడు ప్రారంభమైతే అప్పుడు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఉపాధి కూలీలు గ్రామాల్లోకి ఫీల్డ్ అసిస్టెంట్‌లను కలిసి కోరుతున్నారని అధికారులు పేర్కొన్నారు.



చేసిన పనికి కొలతలు తీస్తున్న ఈజీఎస్ సిబ్బంది

ఉపాధి హామీ పనులతో పొలాలకు వెళ్లేందుకు రోడ్ల నిర్మాణం..

ఉపాధి హామీ పథకం కింద రైతులు పొలాలకు వెళ్లేందుకు రోడ్లు నిర్మించేందుకు నిర్ణయించినట్లు ఈజీఎస్ అధికారులు పేర్కొన్నారు. గతంలో పొలాలకు వెళ్లేందుకు రైతులే తలా కొంత డబ్బులు జమ చేసి రోడ్డును నిర్మించుకునే వారు ఇప్పుడు ఆ పరిస్థితి లేదని వారు తెలిపారు. ప్రభుత్వమే ఉపాధి హామీ పథకం కింద రోడ్డు నిర్మాణం చేపడుతుండటంతో రైతులకు కొంత మేర ఆర్థిక భారం తప్పినట్లయింది.

ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులు..

● ఇంకుడు గుంతలు, పశువుల పాకల నిర్మాణం.



● గ్రామానికో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కల పెంపకం, వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు గుంతల తవ్వకం.

● దరఖాస్తు చేసుకున్న రైతుల భూముల్లో ఆయిల్ పామ్, తైవాన్ జామ మొక్కలు నాటడం.

● గ్రామాల్లో కచ్చా డ్రైనేజీల ఏర్పాటు.

● గ్రామాల్లోని కాలువలు, కుంటలు, చెరువుల్లో మట్టి పూడికతీత, పొలాలకు వెళ్లేందుకు బండ్ల బాట నిర్మాణం.

● వర్షం నీటి వృథాను అరికట్టేందుకు అడవుల్లో కందకాల తవ్వకాలు.

మండలంలో మొత్తం జాబ్ కార్డులు..

దిలావర్‌పూర్ మండలంలో 12 గ్రామ పంచాయతీల్లో కలిపి మొత్తం 7,039 జాబ్ కార్డులునన్నట్లు ఏపీవో దివ్య రెడ్డి తెలిపారు. వీటిలో 4,554 జాబ్ కార్డులు యాక్టివ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు మండలంలో 186 మంది వంద రోజుల పని పూర్తి చేసుకున్నారు. ఇప్పటి వరకు 3 మట్టి రోడ్లు నిర్మించాం. 16 ఇంకుడు గుంతలు, 8 పశువుల పాకలు నిర్మించాం. పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకున్న రైతులకు చెందిన 40 ఎకరాల్లో ఆయిల్ పామ్, 2 ఎకరాల్లో తైవాన్ జామ, 2 ఎకరాల్లో మామిడి మొక్కలు నాటించామన్నారు.

గత ఆర్థిక సంవత్సరం నిర్దేశిత లక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేశాం

● పూంద్రు దివ్య రెడ్డి, ఎంజీఎన్ ఆర్‌ఈజీఎస్ ఏపీవో, దిలావర్‌పూర్



గత ఆర్థిక సంవత్సరం మాకు నిర్దేశించిన లక్ష్యాన్ని తమ సిబ్బంది సహకారంతో వంద శాతం పూర్తి చేశాం. ఈ ఏడాది లక్ష్యం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము. ప్రభుత్వ ఆదేశాలు రావలసి ఉంది. కూలీలు ఉపాధి హామీ పనులు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అడిగిన ప్రతీ ఒక్కరికి పని కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాం. పనులను పకడ్బందీగా చేయిస్తున్నాం.

అసంపూర్తిగా పంచాయతీ భవనాలు

● అవస్థలు పడుతున్న ప్రజలు ● నిధులు మంజూరైనా విడుదల కాక ఇబ్బందులు

కుంటాల, ఏప్రిల్, 13 (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని పలు గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా డబ్బులు విడుదల చేయక పోవడంతో భవనాలు అసంపూర్తి నిర్మాణంలో ఉన్నాయి. దీంతో గ్రామ పంచాయతీల కార్యకలాపాలను ప్రైవేటు వ్యక్తుల ఇళ్లలో, పాఠశాలల్లో కొనసాగించాల్సి వస్తుందని దీనివల్ల ఇబ్బం దులు ఎదురవుతున్నాయని సంబంధిత అధికారు లతో పాటు ప్రజలు పేర్కొంటున్నారు. కుంటాల మండలంలో వెంకూర్, మెదన్‌పూర్, అంబుగాం, అంబకంటి తండాలో గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు లేక పోవడంతో రెండేళ్ల క్రితం ప్రభుత్వం ఎస్‌ఆర్‌ఈజీఎస్ నుంచి ఒక్కో పంచాయతీ నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూరు చేసింది. అప్పట్లో పనులను కూడా ప్రారంభించింది. అయితే పనులు కొనసాగించిన సదరు కాంట్రాక్టర్లు డబ్బులు రాక పోవడంతో అసం పూర్తిగానే వదిలేశారు. దీంతో ప్రతిరోజు పలు రకాల సౌకర్యాల కోసం గ్రామ పంచాయతీలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రైవేటు భవనాల్లో పంచాయతీ కార్యకలాపాలు కొనసాగడం వల్ల పలు సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర వుతున్నాయి. కొన్ని చోట్ల విద్యుత్ సౌకర్యం లేక పోవడం, మరి కొన్ని చోట్ల సిగ్నల్ లేకపోవడం మూలంగా గ్రామ పంచాయతీలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని పంచాయతీ సిబ్బందితో పాటు ప్రజలు పేర్కొంటున్నారు. భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించినప్పటికి డబ్బులు విడుదల చేయకపోవడంలో అంతర్యమేమిటోనని ప్రజలు పేర్కొంటున్నారు. అయితే గ్రామ పంచాయతీలో ప్రతిరోజు ఎన్నో రకాల సేవలు ప్రజలకు ఉదయం నుంచి సాయంత్రం వరకు అందించాల్సి ఉండగా సొంత భవనాలు లేక ఈ సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయని సదరు గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు మాత్రం భవనాలు ఎంతవరకు నిర్మించారో వాటికి సంబంధించి బిల్లుల కోసం ప్రతిపాదనలు పంపడం జరిగిందని ప్రభుత్వం నుంచి డబ్బులు రావాల్సి ఉందని పేర్కొంటున్నారు. కాంట్రాక్టర్లు తమకు డబ్బులు రాకనే వదిలేశామని పేర్కొంటున్నారు. ఏది ఏమైనా తమకు పంచాయతీ నూతన భవనాలు నిర్మాణం పూర్తయితే తప్ప సేవలందడం ఇబ్బందికరంగా ఉందని ఆ గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.



అంబుగాంలో అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న గ్రామ పంచాయతీ భవనం

అంబకంటి తండా పాఠశాలలో..

అంబకంటి తండా పంచాయతీలో పంచాయతీ భవనం లేక అక్కడ గ్రామ పంచాయతీ ఏర్పడినప్పటి నుంచి పాఠశాలలో గ్రామ పంచాయతీ విధులు కొనసాగిస్తున్నారు. దీంతో పాఠశాల విద్యార్థులకు ఇబ్బంది కరంగా మారింది. నూతన భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం డబ్బులు విడుదల చేస్తే భవనాల నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యే అవకాశం ఉంది.

డబ్బులు రావడం లేదు : పీఆర్‌డీఈ రాజేందర్ రావు

కుంటాల మండలంలోని మెదన్‌పూర్, అంబుగాం, వెంకూర్, అంబకంటి తండాలలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాలకు సంబంధించి బిల్లుల కొరకు ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించాం. డబ్బులు విడుదల కాగానే సదరు కాంట్రాక్టర్లకు అందజేస్తాం. మిగితా పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తాం

మార్గం ఉన్నా.. సరైన మార్గదర్శి లేడు!

● బస్సు సదుపాయం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు

సోనాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రహదారులు బాగున్నా సరైన బస్సు సదుపాయం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. బోథ్, సోనాల మండల కేంద్రాల నుంచి హైదరాబాద్ నగరానికి ప్రతీరోజు రాత్రి 9.30 గంటల సమయంలో ప్రత్యేక బస్సు నడుస్తుంది. అలాగే గతంలో రోజువారీ లాగానే అర్ధరాత్రి 11 గంటలకు హైదరాబాద్ గాంధీ బస్టాండ్ నుంచి వయా నిర్మల్ ఉదయం 5గంటలలోపు బోథ్, సోనాల వరకు బస్సు చేరుకునేది. కాని ప్రస్తుతం ఆ బస్సు కేవలం నిర్మల్ వరకే పరిమితం అయింది. బోథ్, సోనాల మండలానికి చెందిన ప్రయాణికులు ఉదయం 6 గంటల వరకు బస్టాండ్‌లోనే సేదతారాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యా, ఉపాధి, ఆసుపత్రులకు వివిధ పనుల కోసం ప్రతిరోజు ఈ ప్రాంతం నుంచి నగరానికి వెళ్లి తిరిగి వస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితి ఏర్పడింది. ఓ వైపు ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న బస్సుల సంఖ్య మాత్రం తగ్గుతు వస్తుంది. దీంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ప్రతియేటా సంక్రాంతి, దసరా, ఉగాది తదితర ప్రధాన పండుగలకు వచ్చి వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు తిరిగి నిర్మల్ లేదా ఆదిలాబాద్ పట్టణాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి నిర్మల్ వరకే కాకుండా తిరిగి సోనాల వరకు పునఃప్రారంభించాలని ప్రయాణికులు కోరుతున్నారు.





నీరు లేక ఎండిపోయిన జొన్న పంట



చిక్మాన్ ప్రాజెక్ట్‌లో నీళ్లు లేకపోవడంతో క్రికెట్ ఆడుతున్న యువకులు

సాగు నీరు లేక ఎండుతున్న జొన్న పంట

● ఇబ్బందులు పడుతున్న రైతులు ● పట్టించుకోని అధికారులు

సిరికొండ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఆశలతో యాసంగిలో జొన్న సాగు చేసిన రైతులు నీటి ఎద్దడితో పరేషాన్ అవుతున్నారు. చిక్మాన్ ప్రాజెక్ట్ ఆయకట్టు పరిధిలో వందల ఎకరాల్లో జొన్న పంటను సాగుచేశారు. సిరికొండ, రాంపూర్(బి), కొండాపూర్ గ్రామాల పరిధిలో పంటలు వేసిన రైతులు నీటి తడులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పంట కంకి దశలో ఉండడంతో నీటి తడులు తప్పనిసరి కానీ చిక్మాన్ ప్రాజెక్ట్‌లో నీరు లేకపోవడంతో జొన్న పంట ఎండిపోతుంది. ఎండుతున్న పంటలను కాపాడుకునే పరిస్థితి లేక నిరాశ, నిస్పృహలతో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. జిల్లాలోని సిరికొండ, ఇంద్రవెల్లి మండలాల పరిధిలో దాదాపు 1500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు నిర్మించిన ప్రాజెక్ట్‌లో గత పద్దెనిమి దేళ్లుగా పూడిక తీయకపోవడంతో మట్టితో పూర్తిగా నిండి పోయింది. దీంతో వచ్చిన వర్షపు వచ్చినట్లే కిందికి వెళ్లిపోవడంతో నీరు నిల్వ ఉండడం లేదు. కొద్ది మొత్తంలో నీరు నిల్వ ఉండ డంతో దాదాపు 200 ఎకరాలకు కూడా సాగునీటిని అందించ లేకపోతుంది. దీంతో ఈ ప్రాజెక్ట్ కింద ఎంతో ఆశపడి రైతులు వేసిన పంటలు నేడు ఎండిపోయే పరిస్థితి దాపురించింది. దీనికితోడు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మిషన్ కాకతీయ పథ కానికి కూడా నోచుకోక పోవడంతో ఎంతో ఆశయంతో నిర్మించిన ఈ ప్రాజెక్ట్ నేడు నెర్రలు వారి నిరుపయోగంగా మారింది. రైతులకు సాగునీరు అందించాల్సిన ఈ ప్రాజెక్ట్ నేడు యువకులకు క్రికెట్ ఆట మైదానంలా మారింది. నాడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మిం చిన ప్రాజెక్ట్ జలకళను సంతరించుకోగా.. నేడు అది నీరు లేక ఎండి పోవడంతో ఆట మైదానంలా మారి, రైతులకు శాపంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం ఇటు వైపు దృష్టి సారించి ప్రాజెక్ట్‌లో చేరిన పూడికను తొలగించి ప్రాజెక్ట్ కట్ట ఎత్తును పెంచి, తలుపులు ఏర్పాటు చేసి, ప్రాజెక్ట్ ఎడమ కాలువను నిర్మించి, కుడి కాలువకు మరమ్మతులు చేప ట్టాలని రైతులు కోరుతున్నారు. పక్కన కనిపిస్తున్న జొన్న పంట బియ్యాల మల్లేష్ అనే రైతు కౌలుకు తీసుకుని 7 ఎకరాల్లో జొన్న పంటను సాగు చేస్తున్నాడు. చిక్మాన్ ప్రాజెక్ట్‌లో నీరు పూర్తిగా ఎండి పోవడంతో 3 ఎకరాల జొన్న పంట ఎండిపోతుంది. దీంతో ఎంతో ఆశపడి పంట పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో మల్లగుల్లాలు పడుతున్నాడు. ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా చిక్మాన్ ప్రాజెక్ట్‌లోని పూడికను తొలగించి, దాని ఎత్తును పెంచి గేట్లు ఏర్పాటు చేయాలి.



ఎండిపోయిన చిక్మాన్ ప్రాజెక్ట్

పాలిటెక్నిక్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ప్రిన్సిపాళ్ల పాల్గొని అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రస్తుత ప్రిన్సిపాల్ బండా రాంబాబు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో 1980లో పాలిటెక్నిక్ కళాశాల మూడు బ్యాచులతో ప్రారంభమైందన్నారు. 1993లో నూతన భవనం నిర్మించి మార్చడం జరిగిందన్నారు. మారుతున్న కాలంతో పాటే పాలిటెక్నిక్‌లో కోర్సులను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ప్రస్తుతం కళాశాలలో 460 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారి బ్యాచుల్లో రాణించేల అధ్యాపకులు నాణ్యమైన బోధనను అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి.




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ బండా రాంబాబు









నత్తనడకన కొనసాగుతున్న రోడ్డు పనుల దృశ్యం

ఫొటో న్యూస్

అడెల్లి అమ్మవారి దర్శనానికి దూర భారం

● ఆదిలాబాద్ టూ బోథ్ మీదుగా అడెల్లి 65

● ఆదిలాబాద్ టూ నిర్మల్ మీదుగా అడెల్లి 95

ఆదిలాబాద్ టూ అడెల్లి వెళ్లాలంటే ఆదిలాబాద్ నుంచి నిర్మల్ జిల్లా చించోలి మీదుగా సారంగాపూర్ మీదుగా అడెల్లి చేరుకోవడానికి దాదాపు ఒక 180 కిలో మీటర్ల మైళ్ల దూరం వెళ్లాల్సిందే. సారంగాపూర్ నుంచి బోథ్ వెళ్లే మార్గ మధ్యంలో ఉన్న ఘాట్ రోడ్డు పై తారు రోడ్డుతో రోడ్డుకు మరమ్మతులు చేపడితే దాదాపు 60కిలో మీటర్ల దూరం తగ్గుతుంది. అధికారులు ప్రజాపాలకులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఆదిలాబాద్ జిల్లా వాసులకు అడెల్లి అమ్మవారి దర్శనం సులువు కావాలంటే బోథ్ మండలంలోని ఘాట్‌రోడ్డు పనులు పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని త్వరితగతిన పనులు చేపట్టి రోడ్డు సత్వరంగా పూర్తయిన చర్య చేపట్టాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

● (ఆదిలాబాద్ ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్)



విద్యుత్ ప్రమాదాలకు.. అడ్డుకట్ట!



నిర్మల్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్

- ఎన్పీడీసీఎల్‌లో ఆన్‌లైన్ ఎల్‌సీ యాప్ క్రియేట్
- పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లపై ఎప్పటికప్పుడు అలర్ట్
- లైన్‌మెన్‌లకు, సబ్‌స్టేషన్ ఆపరేటర్లకు వార్నింగులు

నిర్మల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కరెంటు సరఫరా కోసం చేపట్టే మరమ్మతుల సమయంలో జరుగుతున్న ప్రమాదాలను అరికట్టేందుకు ఎన్పీడీసీఎల్ సంస్థ ప్రత్యేకంగా ఆన్‌లైన్ ఎల్‌సీ యాప్‌ను తెరపైకి తెచ్చింది. ఈ యాప్ వినియోగంపై ఏఈలకు సంబంధిత లైన్‌మెన్‌లు, అసిస్టెంట్ లైన్ మెన్‌లకు అలాగే సబ్ స్టేషన్‌లలో ఆపరేటర్లకు ఇప్పటికే అవగాహన కల్పించారు. గత కొంతకాలం నుంచి ఎల్‌సీలు తీసుకొని కరెంటు పోల్స్‌పైన, సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పని చేసే సమయంలో సమాచార లోపం, మానవ తప్పిదాల కారణంగా ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. ఈ ప్రమాదాల్లో విద్యుత్ సిబ్బంది తీవ్రంగా గాయపడడమే కాకుండా పలువురు ఇప్పటికే ప్రాణాలు సైతం కోల్పోయారు. ఇలాంటి ప్రమాదాలను నివారించేందుకు ఎన్పీడీసీఎల్ సంస్థ వినూత్నంగా ఆన్‌లైన్ లైన్ క్లియర్ యాప్‌ను రూపొందించింది. ఈ యాప్ ద్వారా ఎల్‌సీలు తీసుకున్న సమాచారం గురించి పై అధికారులకు వెంటనే తెలిసిపోతుందని అలాగే సంబంధిత ఏఈ అనుమతి లేకుండా తీసుకునే ఎల్‌సీలను కూడా ఈ యాప్ ద్వారా నివారించవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

పకడ్బందీగా ఎల్‌సీ యాప్ వినియోగం

విద్యుత్ సిబ్బంది ఇక నుంచి లైన్ క్లియర్ యాప్‌ను పకడ్బందీగా వినియోగించబోతున్నారు. కరెంటు సప్లయ్ పనుల కోసం ఎల్‌సీ తీసుకోవాలనుకునే లైన్‌మెన్ మొదట ఈ యాప్‌ను ఓపెన్ చేయాల్సి ఉంటుంది. యాప్‌ను ఓపెన్ చేసిన తర్వాత అందులో సంబంధిత ఫీడర్లలో ఎల్‌సీ కావాలని ఏఈకి తెలపాల్సి ఉంటుంది. దీంతో ఏఈ లైన్‌మెన్ రిక్వెస్ట్‌ను పరిశీలించి సంబంధిత ఫీడర్లకు ఎల్‌సీ ఇవ్వవచ్చా లేదా అని అలాగే ఇవ్వలేని పరిస్థితి ఉందా అనే అంశంతో పాటు ఎమర్జెన్సీతో పాటు షెడ్యూల్ చేయబడిన పనులు ఉన్నాయా అనే విషయాన్ని తెలుసుకోవాల్సి ఉంటుంది. పరిస్థితులన్నీ అనుకూలిస్తే ఏఈ ఈ యాప్ ద్వారానే లైన్ క్లియర్‌కు అనుమతులు ఇస్తారు. ఇదే యాప్ ద్వారా సంబంధిత సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు కూడా లైన్ క్లియర్‌కు సంబంధించిన సమాచారం వెళుతోంది. ఈ యాప్ ద్వారా అందుకున్న సమాచారం మేరకు సంబంధిత సబ్‌స్టేషన్ ఆపరేటర్ లైన్‌మెన్‌కు పలు సూచనలు అందిస్తారు. లైన్‌మెన్ హెల్మెట్ పెట్టుకోవాలని, హ్యాండ్ గ్లౌజెస్ తొడుక్కోవాలని, ఎర్త్ రాడ్ వేయాలని అలాగే ఏబీ స్విచ్ ఓపెన్ చేశారా లేదా అనే విషయాన్ని ఈ యాప్ ద్వారా లైన్‌మెన్‌కు సమాచారం అందుతోంది. ఎప్పటికప్పుడు ఈ యాప్ ఇటు సబ్‌స్టేషన్ ఆపరేటర్‌ను అటు పనులు చేసే లైన్‌మెన్‌ను అప్రమత్తం చేస్తోంది. లైన్‌మెన్ విద్యుత్ సరఫరాకు సంబంధించిన మరమ్మతులు పూర్తి చేసి అనంతరం ఆ పనులకు సంబంధించిన ఫొటోలు అన్నింటిని యాప్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. దీని కారణంగా ఎల్‌సీ రిటర్న్ చేసేందుకోసం సంబంధిత ఆపరేటర్‌లకు ఈ యాప్ ద్వారా సమాచారం తెలుస్తోంది. ఈ యాప్ ద్వారా విద్యుత్ ప్రమాదాలను పూర్తిగా నివారించే అవకాశం ఏర్పడుతుందని ఎన్పీడీసీఎల్ అధికారులు పేర్కొంటున్నారు.

మరమ్మతు సమయంలో ఎల్‌సీ కీలకం

విద్యుత్ సరఫరా విషయంలో ఎల్‌సీ అత్యంత కీలకమైనదిగా అధికారులు చెబుతున్నారు. విద్యుత్ సిబ్బంది పోల్స్‌పై కానీ సబ్‌స్టేషన్లపైన ట్రాన్స్‌ఫార్మర్లపైన గాని మరమ్మతు పనులు చేసే సమయంలో ఎల్‌సీ కీలకంగా మారుతోంది. ఎల్‌సీ తీసుకునేందుకు సంబంధిత సిబ్బంది మొదట సబ్‌స్టేషన్ ఏఈ అనుమతిని పొందాల్సి ఉంటుంది. ఇతరుల కరెంటు సరఫరాకు ఎక్కువ సమయం ఆటంకం కలిగించకుండా నిర్ణీత సమయంలోనే ఎల్‌సీ ఆధారంగా మరమ్మతులు పనులు చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు సరైన సమాచార వ్యవస్థ పకడ్బందీగా లేకపోవడంతో ఎల్‌సీ విషయంలో మానవ తప్పిదాలకు ఆస్కారం ఏర్పడుతోంది. దీంతో ప్రమాదాలు సైతం పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఎన్పీడీసీఎల్ సంస్థ పూర్తి సాంకేతికతను ఉపయోగించుకొని రూపొందించిన ఆన్‌లైన్ లైన్ క్లియర్ యాప్ ప్రమాదాలను నివారించేందుకు దోహద పడనుంది.



ఎల్‌సీ యాప్ వినియోగంపై సిబ్బందికి అవగాహన



సబ్‌స్టేషన్ వద్ద మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది





మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

భక్తులతో కిటకిటలాడిన దేవాలయం



అడెల్లి ఆలయంలో పాల్గొన్న భక్తులు

సారంగాపూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అడెల్లి మహాపోచమ్మ దేవాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల నుండే కాకుండా మహారాష్ట్ర నుండి అధిక సంఖ్యలో భక్తులు హాజరై ఆలయంలో మొక్కులు మొక్కి అమ్మవారికి పెరుగన్న, నైవేద్యంగా సమర్పించారు. భక్తులు పూకం వచ్చి భక్తుల వద్ద జాతకాలను సరిచుకున్నారు. ఇంచార్జీ ఈవో రమేష్ ఆలయంలో మొక్కులు తీర్చుకోవడానికి వచ్చినటువంటి భక్తులు ఎలాంటి ఇబ్బందులను ఎదుర్కోకుండా ఉండడానికి గట్టి చర్యలు తీసుకున్నారు. అలాగే తాగు నీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు చేపట్టారు. దీంతో పాటు ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సులలో ప్రయాణం ఉచితంగా ప్రకటించడంతో అడెల్లి మహాపోచమ్మ ఆలయం వద్దకు ఆర్టీసీ బస్సులలో మహిళ భక్తులు మొక్కులు తీర్చుకోవడానికి రావడంతో ఆర్టీసీ బస్సులు మహిళ ప్రయాణికులతో కిక్కిరిసి పోయాయి.

కుంటాలలో కుస్తీ పోటీలు



కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

కుంటాల, ఏప్రిల్, 13 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాలలో ఆదివారం రోజు కుస్తీ పోటీలు నిర్వహించారు. ప్రతియేడాది హనుమాన్ జయంతిని పురస్కరించుకొని జయంతి మరుసటి రోజు ఈ కుస్తీ పోటీలను నిర్వహిస్తూ ఉంటారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కుస్తీపోటీలకు మండలం నలుమూలల నుంచే కాకుండా పక్క మండలాలు, సరిహద్దు మహారాష్ట్ర నుండి సైతం మల్లయోధులు ఈ కుస్తీ పోటీల్లో తలపడ్డారు. ఈ పోటీలను తిలకించేందుకు చాలా గ్రామాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కుస్తీ పోటీల్లో దాదాపు 200ల మంది వరకు పాల్గొన్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పోటీలలో ఉమ్రి తాలుకా బిద్రాల్లి గ్రామానికి చెందిన సాయినాథ్ మొదటి బహుమతికి ఎంపికయ్యాడు. అతనికి గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి గజ్జలమ్మ చిత్రపటంతో పాటు రూ. 5100 ల నగదు అందజేశారు.

గజ్జలమ్మ ఆలయంలో పూజలు

కుంటాల, ఏప్రిల్, 13 : (ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రంలోని కుంటాల గజ్జలమ్మ ఆలయంలో ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రీతిపాత్రమైన నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు తాగునీటితో పాటు అన్ని ఏర్పాట్లు చేశారు.

అంబేద్కర్‌కు కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యం ఇవ్వలేదు

- బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న రితేష్ రాథోడ్

ఖానాపూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌ను గతంలో అనేకసార్లు అవమానించిందని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ అన్నారు. అంబేద్కర్ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం బీజేపీ ఖానాపూర్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఖానాపూర్‌లో నిర్వహించిన అంబేద్కర్ విగ్రహ శుద్ధి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేసి విగ్రహం ఎదుట శ్రమదానం నిర్వహించి చెత్తా చెదారాన్ని తొలగించారు. అనంతరం రాథోడ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ హయాంలో అంబేద్కర్ ప్రాధాన్యతను తగ్గించి కనీసం భారతరత్న అవార్డు కూడా ఇవ్వలేకపోయారని ఆరోపించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, పట్టణ అధ్యక్షులు కీర్తి మనోజ్ కుమార్, మండల అధ్యక్షులు పుప్పాల ఉపేందర్, ఎంఆర్‌పీఎస్ నాయకులు బిక్కి మురళి, బీజేపీ పట్టణ అధ్యక్షులు నాయిని సంతోష్, కొండేవణి రమేష్ అంబేద్కర్ యువజన సంఘం నాయకులున్నారు.

నిర్మల్‌కల్చరల్ : డాక్టర్ అంబేద్కర్ ఆలోచన విధానాల స్ఫూర్తితో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని జిల్లా బీజేపీ అధ్యక్షుడు రితేష్ రాథోడ్ అన్నారు. అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ట్యాంక్‌బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేశారు. ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ 1952లో కమ్యూనిస్ట్ నాయకులతో కలిసి అంబేద్కర్‌ను ఓడించారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో అంబేద్కర్‌కు భారతరత్న అవార్డు ఇవ్వకపోవడంపై వారు మండిపడ్డారు. అంబేద్కర్ ఆలోచన విధానాలకు పునాదులు వేస్తే అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం మోదీ ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. కార్యక్రమ కన్వీనర్ రమేష్, రాచకొండ సాగర్, అయ్యన్నగారి భూమయ్య, ఒడిసెల అర్జున్, సుంకరి సాయి, ఆడెపు సుధాకర్ పాల్గొన్నారు.

భైంసా రూరల్ : మండలంలోని ఎగ్గాం గ్రామంలో ఆదివారం బీజేపీ మండల అధ్యక్షురాలు సీరం సుష్మ రెడ్డి ఆధ్వర్యంలో గావ్ చలో అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని రామాలయంలో స్వచ్ఛభారత్‌ను చేపట్టి ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఆవిర్భావ వేడుకల్లో భాగంగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి జలాభిషేకం చేశారు. అనంతరం రేషన్‌షాప్‌నకు వెళ్లి బియ్యం కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేస్తుందని వివరించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షురాలు సీరం సుష్మ రెడ్డి మాట్లాడుతూ... బీజేపీ అధిష్టానం, ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గంగా ధర్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు భూమేష్, వన్ నేషన్ వన్ ఎలక్షన్ ప్రోగ్రాం కన్వీనర్ సాయినాథ్, కోకన్వీనర్ దేవిదాస్, ఆవిర్భావ వేడుకల కో-కన్వీనర్ మహేందర్, సీనియర్ నాయకులు నాగన్న పాల్గొన్నారు.

భైంసా : మున్సిపల్ కేంద్రమైన భైంసాలోని సిద్దార్థనగర్ ప్రాంతంలో గల బీఆర్ అంబేద్కర్ విగ్రహ స్థలి వద్ద ఆదివారం శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్, ప్రధాన కార్యదర్శి భూకిరణ్, మిర్జాపూర్ పీఏసీఎస్ డైరెక్టర్ వడ్నపు శ్రీనివాస్, ప్రతినిధులు రావుల రాము, బండారి దిలీప్, కాసర్ల ప్రవీణ్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ శ్రేణులు ముందుగా బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని నీటితో కడిగి శుభ్రపరిచారు. అనంతరం విగ్రహ స్థలితో పాటు పరిసర ప్రాంతాల్లో పరిసరాలను శుభ్రపరిచారు. పూర్తిగా పిచ్చి మొక్కలను తొలగించారు.

'సీఎం సహాయ నిధితో భరోసా'

భైంసా, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : వివిధ కారణాలతో అనారోగ్యం పాలై ఆసుపత్రుల్లో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ బాసటగా నిలుస్తుందని ముథోల్ నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం భైంసా మండలంలోని దేగాం గ్రామంలో ప్రభుత్వం నుంచి పలువురు బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ వివరాల కోసం బాధిత కుటుంబాలు తమను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా భైంసా, తానూర్ మండల పరిధిలోని పలు బాధిత కుటుంబాలకు మంజూరైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు ఉత్తమ్ బాలేరావ్, సూర్యంరెడ్డి పాల్గొన్నారు.

ముధ్గల్‌లో మొక్కజొన్న పంట దగ్ధం

ముథోల్, ఏప్రిల్ 13 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని ముధ్గల్ గ్రామ శివారులో ఆదివారం మధ్యాహ్నం పి.ముత్యం అనే రైతుకు చెందిన మొక్కజొన్న పంట దగ్ధమైంది. బాధితుడి కథనం ప్రకారం... బాధితుడు తనకున్న మూడెకరాల మొక్కజొన్న చేనులో రెండెకరాల మొక్కజొన్న పంట దిగుబడులు ఇంటికి తీసుకెళ్లగా ఒక ఎకరం మొక్కజొన్న పంటను కోసి చేనులో యంత్రంతో పట్టించేందుకు సిద్ధమయ్యాడు. అయితే ఆదివారం మిట్ట మధ్యాహ్నం వడగాలులు వీయడంతో ఒక్కసారిగా కోసిన మొక్కజొన్న పంటకు మంటలు అంటుకున్నాయి. విషయం గమనించిన రైతులు బాధితుడికి సమాచారం అందించి మంటలు చుట్టు పక్కల వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. అయితే బాధితుడికి సంబంధించిన ఎకరం మొక్కజొన్న కాలి బూడిదైంది. రూ. 80 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. వడగాలులు వీయడంతో చేనులో ఉన్న విద్యుత్ తీగలు ఒక దానికొకి తగిలి మంటలు అయి ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.



కాలి బూడిదైన మొక్కజొన్న పంట

తెలుగు భాషకు అన్యాయం చేయవద్దు

- తెలంగాణ తెలుగు కళా నిలయం అధ్యక్షుడు జాదవ్



పుస్తకాలను అందజేస్తున్న దృశ్యం

భైంసా, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాలల్లో ద్వితీయ భాషగా సంస్కృతం ప్రవేశ పెట్టాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ తెలుగు కళా నిలయం అధ్యక్షులు జాదవ్ పుండలీక్‌రావ్ పాటిల్ డిమాండ్ చేశారు. ఆదివారం భైంసా పట్టణ పరిధిలో పలు కేంద్రాలలో తెలంగాణ ఉద్యమకారులు ముథోల్ నియోజక వర్గం పుస్తక పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. ఇప్పటికే కొన్ని దశాబ్దాలుగా విద్యార్థులకు మార్కుల వేటాల ప్రభుత్వం సంస్కృత భాషను అలవాటు చేసిందని ఆరోపించారు. ప్రస్తుతం సంస్కృత భాషను ద్వితీయ భాషగా ప్రవేశపెట్టేందుకు నిర్ణయం తీసుకోవడం ద్వారా తెలుగుకు మరింత అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన పుస్తకాలను మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చందులాల్, లయన్స్ క్లబ్ ప్రతినిధి డా.ముత్యం రెడ్డి, తదితర ప్రతినిధులకు అందజేశారు.

రైతులు వరి కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

- ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ముథోల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరికొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. మండలంలోని వడ్తాల్ గ్రామంలో ఆదివారం స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ ఛైర్మన్ ఆనంద్ రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రైతులు ప్రైవేట్ వ్యక్తుల వద్ద ధాన్యం అమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలలో విక్రయించాలని సూచించారు. ముథోల్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఏఎంసీ ఛైర్మన్ ఆనంద్ రావు పటేల్ మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చెల్లింపులో మధ్యవర్తుల ప్రమేయానికి ఏమాత్రం ఆస్కారం లేకుండా ఆన్‌లైన్ విధానాన్ని తీసుకు వచ్చిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఏపీఎం గురుచరణ్, స్వయం సహాయక సంఘం అధ్యక్షురాలు అనసూయ బాయి, భోజవ్వ, సీసీ సూర్యకాంత్, స్వయం సహాయక సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

లోకేశ్వరం : వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ముథోల్ శాసనసభ్యులు ఎమ్మెల్యే పవర్ రామా రావు పటేల్ అన్నారు. మండలంలోని కనకాపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోని విక్రయించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ం కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆనంద్ రావు పటేల్, బీజేపీ మండల అధ్యక్షులు సాయన్న, చిన్న దేవన్న, ఓరగంటి గోపి, ఐకేపీ ఏపీఎం మల్లేష్, ఐకే పీసీసీ శ్రీనివాస్, ఐకేపీ సీఏ దెబ్బడి పోశెట్టి, ఐకేపీ మహిళా అధ్యక్షురాలు సాగర తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్

- కాంగ్రెస్ మహిళా విభాగం నిర్మల్ జిల్లా అధ్యక్షురాలు



గాంధీనగర్‌లోవంట చేస్తున్న కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు

ఖానాపూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ధనికులే కాదు నిరుపేదలు సైతం సన్న బియ్యం అన్నం తినాలనే సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంతో నెరవేరిందని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం నిర్మల్ జిల్లా అధ్యక్షురాలు సిహెచ్. దుర్గాభవాని అన్నారు. ఆదివారం ఈ టీపీ సీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఆదేశాల మేరకు నిర్మల్ జిల్లా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఖానాపూర్ పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి దుర్గాభవాని ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం కాలనీలోని దళితవాడలో తెలంగాణ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యంతో దుర్గాభవాని స్వయంగా వంట చేసి కాలనీ వాసులకు వడ్డించారు. ఓ వైపు తమ ప్రభుత్వం నిరుపేదలను సైతం ధనికులతో సమానంగా సన్న బియ్యం తినేందుకు ప్రోత్సహిస్తుంటే కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచి నిరుపేదలపై భారం మోపుతోందని మండిపడ్డారు. మహిళా కాంగ్రెస్ నిర్మల్ జిల్లా ఉపాధ్యక్షురాలు ముసుకు గంగవ్వ, ఖానాపూర్ మండల అధ్యక్షురాలు కలమడుగు శారద, కడెం మండల అధ్యక్షురాలు మాదాసు సురేఖ, ఖానాపూర్ పట్టణ అధ్యక్షురాలు చందన తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పాల్గొన్న పూర్వవిద్యార్థులు

భైంసా, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివేకానంద హైస్కూల్‌లో ఆదివారం 2008-09 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 16 సంవత్సరాల తదుపరి ఆత్మీయ సమ్మేళనంలో భేటీ అయిన పూర్వవిద్యార్థులు అప్పటి మధురస్మృతులను నెమరు వేసుకుంటూ పరవశించిపోయారు. పాఠశాల స్థాయిలో తీపి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుంటూ ముచ్చట్లతో మురిసిపోయారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ కుటుంబ వ్యవహారాలు, పిల్లల చదువులు తదితర విషయాలు తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ శివాజీ పాటిల్‌తో పాటు చదువు నేర్పిన గురువులు వెంకటేష్, గణేష్, జనార్ధన్‌లతో పాటు ఇతర ఉపాధ్యాయులకు పాదాభివందనాలు చేసి ఘనంగా సన్మానించి జ్ఞాపికలు బహుకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆత్మీయ సమ్మేళనం వేడుకలు ఆద్యాంతం ఉల్లాసంగా.... ఉత్సాహంగా కొనసాగాయి.

వేదభారతి పీఠం సంచాలన సమితి ఏర్పాటు

బాసర,ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): బాసర పుణ్యక్షేత్రంలో గల వేదభారతి పీఠంలో ఆదివారం సంచాలన సమితిని ఏర్పాటు చేశారు. మొదట సమావేశమై ఇటీవల చోటు చేసుకున్న ఘటనలపై చర్చించారు.భవిష్యతులో ఇలాంటివి ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు జాగ్రత్తల గురించి మాట్లాడారు.సమావేశం అనంతరం వేద భారతి పీఠం నిర్వహణ కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. కులాలకు అతీతంగా అందరికీ వేదం నేర్పడంతో పాటు గోదావరి తీరం గత కొన్నేళ్ల నుంచి వేద భారతి పీఠం ఆధ్వర్యంలో నిత్య నది హారతి నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. పీఠం ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల కోసం స్థానికులతో కలిసి ఈ కొత్త సంచాలన సమితిని ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షులుగా దామోదర్ రెడ్డి, అధ్యక్షులుగా శ్యామ్‌సుందర్ మాందానీ, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్ దిద్యాల, సెక్రటరీగా డాక్టర్ ముష్కం రామకృష్ణా గౌడ్ ,జాయింట్ సెక్రటరీగా రాజేష్ బాబు, కోశాధికారి సుబాష్ ధరక్ ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు